


రోహిణి కార్తె ప్రారంభం
కనిపించని సూర్యుడు



మేఘావృతమైన ఆకాశం

ప్రజాశక్తి - పాలకొల్లు

రోహిణి కార్తె ప్రారంభం రోజు శనివారం సూర్యుడు కనిపించకపోవడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మారిన వాతావరణంతో శనివారం రోజంతా మబ్బులు, చిరు జల్లులతో వాతావరణం చల్లబడింది. వాతావరణ శాఖ అల్పపీడనం వాయుగుండంగా, తుఫాన్‌గా మారుతుందని హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వాతావరణం గత కొన్ని రోజులకు భిన్నంగా చల్లబడింది. గత మూడు రోజులుగా ఇదే రకంగా వాతావరణ ఉండటంతో నెల రోజులు పాటు తీవ్ర వేడి, ఉక్క బోతతో ఉక్కిరి బిక్కిరైనా ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే ఇంకా రబీ పంట ఒబ్బిడి చేసుకోని రైతులు మాత్రం మారిన వాతావరణంకు ఆందోళన చెందుతున్నారు.



మూడో పంట.. మాయం..!

డెల్టాలో వేసవి అపరాల సాగు కనుమరుగు - రైతుల అదనపు ఆదాయానికి గండి

భూసారంపై సైతం తీవ్ర ప్రభావం - గతంలో పెద్దఎత్తున అపరాల సాగు

1న సాగునీరు విడుదల చేసినా ప్రయోజనం శూన్యం

వ్యవసాయ శాఖ ప్రణాళికా లోపమేనని విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల్లోని డెల్టా ప్రాంతంలో మూడో పంట కనుమరుగైంది. గతంలో వేసవి సీజన్‌లో మినుము, పెసర వంటి ఆరుతడి పంటలకు ప్రసిద్ధి చెందిన డెల్టా ప్రాంతంలో కొన్నేళ్లుగా వాటి ఆనవాళ్లు కూడా లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతుల అదనపు ఆదాయానికి గండి పడినట్లైంది. దీనికి ప్రధాన కారణం జిల్లా వ్యవసాయశాఖ ప్రణాళికా లోపమేననే విమర్శలు విన్పిస్తున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 5.29 లక్షల ఆయకట్టు ఉంది. ఆక్వా చెరువులు పోను 4.80 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. గతంలో వేసవి పంటగా మినుము, పెసర వంటి పంటలతోపాటు పశువుల మేతగా పిల్లి పెసర వంటి వాటిని రైతులు పండించేవారు. పంట కోత కోసే ముందు రోజు ఈ విత్తనాలను పొలాల్లో చల్లేవారు. మే నెలాఖరుకు ఆరు, 60 రోజుల పంటలను రైతులు మాసూళ్లు చేసేవారు. ఎకరాకు తక్కువగా లెక్కించినా ఆరుతడి పంట కింద రూ.పది వేల వరకూ రైతులు ఆదాయం పొందేవారు. అంతేకాకుండా పశువులకు పుష్కలంగా మేత దొరికేదంతోపాటు ఆరుతడి పంటలు వేయడంతో భూసారం పెరిగేది. భూసారం బాగా ఉండటంతో ఖరీఫ్, రబీ సీజన్లలో దిగుబడులు బాగా వచ్చేవి. ఖరీఫ్, రబీ పంటల్లో ప్రకృతి వైపరీత్యాలతో నష్టాలు చవిచూసినప్పటికీ వేసవి అపరాల పంటలతో రైతులు కొంత ఉపశమనం పొందేవారు. గడిచిన కొన్నేళ్లుగా డెల్టాలో వేసవి అపరాల పంట పూర్తిగా కన్పించని పరిస్థితి నెలకొంది. దీనికి కారణం ఖరీఫ్ సాగు ఆలస్యం కావడం, దీంతో రబీ సాగు మరింత ఆలస్యం కావడంతో వేసవి ఆరుతడి పంటలు వేసేందుకు వీలు కుదరని పరిస్థితి నెలకొంది. దీనికి జిల్లా వ్యవసాయశాఖ ప్రణాళికా లోపమే కారణమని చెబుతున్నారు.

2014లో టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడో పంట సాగుకు ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగింది. అందుకుగాను జూన్ ఒకటో తేదీనే పంట కాలువలకు సాగునీరు విడుదల చేయడం ప్రారంభించింది. దీంతో మళ్లీ మూడో పంట సాగు కొంత పుంజుకుంది. అయితే అది మూణ్ణాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. ప్రస్తుతం ప్రభుత్వం మూడో పంటను పూర్తిగా వదిలేసింది. దీంతో జూన్ ఒకటిన సాగునీరు విడుదల చేస్తున్నప్పటికీ నారుమడులు సకాలంలో వేసేవిధంగా రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయశాఖ విఫలమవుతోంది. దీంతో జూన్ నెలాఖరు వరకూ ఖరీఫ్ నారుమడులు పడటం లేదు. రబీ ఆలస్యమవుతోంది. జనవరి నెలాఖరు వరకూ రబీ నాట్లు పూర్తి కావడం లేదు. దీంతో ఏప్రిల్ మూడో వారంలో కోతలు ప్రారంభమై మే పదో తేదీ వరకూ రబీ మాసూళ్లు కొనసాగుతున్నాయి. అదును తప్పడంతో వేసవి ఆరుతడి పంటలను రైతులు వేయడం లేదు. కొంతమంది రైతులు వేసినప్పటికీ పండకపోవడంతో ఆరుతడి పంటలను పూర్తిగా పక్కన పెట్టేశారు. దీంతో రైతులు ఆదాయం కోల్పోయిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాదైనా కాలువలకు సాగునీరు విడుదల చేసిన వెంటనే నారుమడులు వేసే ఆరుతడి పంటలకు అవకాశం ఉంటుంది. వ్యవసాయశాఖ ఆ విధంగా ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగాలని రైతులు కోరుతున్నారు. ఆరుతడి పంటలకు యంత్రాలతో కోతలు కోయడం కొంత ఇబ్బందికరంగా మారింది. రెండు, మూడు రోజుల్లో కోత కోసేముందు ఆరుతడి పంట విత్తనాలను చల్లుతారు. కోత మిషన్లతో మాసూళ్లు చేయడం కారణంగా విత్తనాలు కొంతమేర దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతోంది. విత్తనాలు చల్లక ఏ విధంగా ఉండాలనే దానిపై వ్యవసాయశాఖ రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా మినుములు, పెసలు దాదాపు రూ.పది వేల వరకూ ధర పలుకుతున్నాయి. రైతులు ఆరుతడి పంటలు పండిస్తే ప్రజలకు ధరలు అందుబాటులోకి వచ్చేందుకు అవకాశంతోపాటు, రైతులకు అదనపు ఆదాయం వచ్చేది. జిల్లాలో డెల్టా ప్రాంతంలో ఆరుతడి పంటలను పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకుంటే జిల్లా రైతాంగానికి మేలు జరుగుతుంది.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ చర్యలు

స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. శనివారం ఏలూరు సమీపంలో వట్లూరులోని సర్ సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లను, కౌంటింగ్ కేంద్రాలను, భద్రతా చర్యలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లన్నీ ముందస్తుగానే పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి అధికారులు, అభ్యర్థులు, వారి ఏజెంట్లు వెళ్లేందుకు బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లన్నీ సంబంధిత రిటర్నింగ్ అధికారులు పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ హాలులోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అనుమతించబోమన్నారు. గుర్తింపు కార్డు లేకుండా ఎవరినీ అనుమతించరాదన్నారు. కౌంటింగ్ సిబ్బందికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఆయా నియోజకవర్గాల కౌంటింగ్ హాళ్లను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. కంట్రోల్ రూమ్‌ను తనిఖీచేసి ఇవిఎంల భద్రతను పరిశీలించారు. సంబంధిత స్ట్రాంగ్‌రూమ్‌ల పరిశీలన అనంతరం సంబంధిత రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. వీరి వెంట రిటర్నింగ్ అధికారులు ఎన్ఎస్‌కె.ఖాజావలీ, ఎం.ముక్కంటి, బి.లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

జెసిచే దెందులూరు స్ట్రాంగ్‌రూమ్ తనిఖీ

దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇవిఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూములను జాయింట్ కలెక్టర్, దెందులూరు రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణి శనివారం తనిఖీచేశారు. స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రతను జెసి పరిశీలించారు. తలుపులకు వేసిన తాళాలను, తాళాలకున్న సీళ్లను, సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సందర్శకుల రిజిస్టర్‌లో జెసి సంతకం చేశారు.



స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలిస్తున్న జెసి లావణ్యవేణి

ఎన్నికల భత్యం ఇప్పించాలని మున్సిపల్ కార్మికుల వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించిన జిల్లాలోని మున్సిపల్ కార్మికులకు ఎన్నికల భత్యం ఇప్పించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నేతలు జిల్లా కలెక్టర్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాల్టీల్లోని మున్సిపల్ కార్మికులు ఈ నెల 13, 14 తేదీల్లో జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో విధులు నిర్వహించారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, బల్లల ఏర్పాటు, ఇవిఎం బాక్సులు మోయడం, దించడం, తరలించడం, సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరచడం వంటి విధులను 13వ తేదీ ఉదయం ఐదు గంటల నుండి 14వ తేదీ ఉదయం ఐదు గంటల వరకు ఏకధాటిగా నిర్వహించారని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.సోమయ్య, జిల్లా కార్యదర్శి ఎ.జాన్‌బాబు తెలిపారు. 24 గంటలపాటు విధులు నిర్వహించిన మున్సిపల్ కార్మికులకు ఎలాంటి ఎన్నికల భత్యమూ చెల్లించలేదన్నారు. రెవెన్యూ, సచివాలయ, మున్సిపల్ సిబ్బందికి, టీచర్లకు ఎన్నికల భత్యం చెల్లించి, మున్సిపల్ కార్మికులకు మాత్రమే ఎన్నికల భత్యం చెల్లించకపోవడం అన్యాయమన్నారు. జిల్లా కలెక్టర్ ఈ విషయం పరిశీలించి ఎన్నికల విధులు నిర్వహించిన మున్సిపల్ కార్మికులకు రావాల్సిన ఎన్నికల భత్యం వెంటనే ఇప్పించాలని కోరారు.

తల్లి మృతదేహంతో కుమారుడు ధర్నా

మృతికి కారకులను శిక్షించాలని

బంధువులు, గ్రామస్తులు రోడ్డుపై బైఠాయింపు

పోలీసుల హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి - కామవరపుకోట

తన తల్లి మృతికి కారకులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కుమారుడు తల్లి మృతదేహంతో ఏలూరు-జంగారెడ్డిగూడెం మెయిన్ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశాడు. నాయ్యం చేయాలని మృతురాలి బంధువులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... వీరిశెట్టిగూడేనికి చెందిన దర్శినపు పాపమ్మ (54) గతంలో ఎంపిటిసిగా పని చేసింది. ఆమె భర్త సుమారు ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో ఆమె సుమారు ఏడేళ్ల నుంచి తడికలపూడిలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంది. తన కుమారుడు దర్శినపు ఏసుబాబు వీరిశెట్టిగూడెంలోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 13వ తేదీన పాపమ్మ వీరిశెట్టిగూడెం వెళ్లి ఓటు వేసి తిరిగి తడికలపూడి వచ్చేసింది. అదేరోజు సాయంత్రం సుమారు 4.30 గంటల సమయంలో వీరిశెట్టిగూడేనికి చెందిన పాపమ్మకు పరిచయం ఉన్న ఒక వ్యక్తి ఆమె వద్దకు వచ్చి ఆమెను బైక్‌పై తీసుకెళ్లాడు. తిరిగి రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో అపస్మారక స్థితిలో ఉన్న పాపమ్మను తడికలపూడిలోని తన సోదరి రత్తమ్మ ఇంటి వద్ద రోడ్డుపై దించి వెళ్లిపోయాడు. అపస్మారక స్థితిలో పాపమ్మను తన సోదరి, బంధువులు కలిసి 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఈ నెల 23వ తేదీ రాత్రి మృతి చెందింది. శుక్రవారం మృతురాలి బంధువులు దెందులూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పాపమ్మను బైక్‌పై తీసుకెళ్లిన వ్యక్తితో పాటు ముగ్గురు, నలుగురు కలిసి పాపమ్మపై అత్యాచారానికి పాల్పడ్డారని, ఆమెపై దాడి చేశారని మృతురాలి కుమారుడు, బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు వారు శనివారం సాయంత్రం పాపమ్మ మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. పాపమ్మను తీసుకెళ్లిన రోజు సాయంత్రం గోపన్నపాలెం ఆసుపత్రికి వైద్యం చేయించేందుకు తీసుకెళ్లినట్లు తెలిసిందన్నారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆమెను రోడ్డుపై వదిలేసి యాక్సిడెంట్‌గా చిత్రీకరించేందుకు చూశారన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి తమకు న్యాయం చేయాలని, పాపమ్మ మృతికి కారకులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ధర్నా విషయం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర, సిఐ రాజేష్, తడికలపూడి ఎస్ఐ జయబాబు అక్కడకు చేరుకుని మృతురాలి బంధువులతో మాట్లాడారు. కేసు దర్యాప్తు చేసి న్యాయం చేస్తామని వారు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

నిర్వాసితుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం దారుణం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పోలవరం నిర్వాసితుడు ఉండమట్ల సీతారామయ్య ఆత్మహత్యాయత్నం ఘటన పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 73 ఏళ్ల వయస్సులో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కోసం ఎనిమిదేళ్లుగా కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి మనస్తాపానికి గురైన సీతారామయ్య చేసేదిలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. ఉన్న భూమిని, ఇంటిని ప్రాజెక్టు కోసం అర్పించిన నిర్వాసితుల పట్ల ప్రభుత్వాలకు కనీసం కనికరం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీతారామయ్యలాంటి నిర్వాసితులు ఇంకా చాలామంది ఉన్నారని పేర్కొన్నారు. నిర్వాసితులందరికీ ఇప్పటికైనా ప్యాకేజీ అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు మీద ఉన్న శ్రద్ధ పోలవరం కోసం భూములిచ్చిన నిర్వాసితులపై లేకపోవడం శోచనీయమని తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్నా నిర్వాసితులను మాత్రం పట్టించుకోవట్లేదని పేర్కొన్నారు. తక్షణం నిర్వాసితులందరికీ ప్యాకేజీ అందించి ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని ఆయన కోరారు.

రేపు శాంతినగర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు శాంతినగర్ సబ్ స్టేషన్ పరిధిలోని11 కెవి శాంతినగర్, విఐపి ఫీడర్‌లకు చెట్లు కొమ్మలు కత్తిరించడం, లైన్లకు మరమ్మతు చేసేందుకు ఈ నెల 27వ తేదీ సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జెపిబి.నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినగర్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్ ఏరియా, టిటిడి కళ్యాణ మండపం రోడ్, కలెక్టర్స్ బంగ్లా రోడ్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

చిన్నంపేటలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలి

సిపిఎం జిల్లా నాయకులు రాజు

ప్రజాశక్తి - చాట్రాయి

నాలుగు నెలలుగా విష జ్వరాలు, కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, కాళ్ల వాపుల సమస్యలతో బాధపడుతున్న రోగులు పూర్తిగా కోలుకునేవరకు ప్రభుత్వ వైద్యాధికారులు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు అన్నారు. చిన్నంపేటలో వ్యాధి గ్రస్తులను వారి అనారోగ్యానికి గల కారణాలను ఆయన శనివారం అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల మురికి నీరు నిల్వ ఉండి దానిలో దోమలు చేరి వాటి వల్ల విషజ్వరాల బారిన పడ్డామని వ్యాధిగ్రస్తులు తెలిపారు. జ్వరాలు తగ్గినా కాళ్ల వాపులు, నొప్పులు, కాళ్ల వాపులు త్వరగా తగ్గటం లేదన్నారు. అనంతరం సిపిఎం నాయకులు రాజు మాట్లాడుతూ విష జ్వరాలతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులు పూర్తిగా కోలుకునే వరకు ప్రభుత్వ వైద్యులు మెడికల్ క్యాంపు నిర్వహించాలని కోరారు. వర్షాలు పడటం వల్ల సీజనల్‌గా వచ్చే వ్యాధులే కాకుండా విష జ్వరాలు, అంటువ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. పూర్తిస్థాయిలో గ్రామంలో తాగునీటి నమూనాలు సేకరించి పరీక్షించి పరిశుభ్రమైన నీటిని ప్రజలకు సరఫరా చేయాలన్నారు. ప్రభుత్వాధికారులు గ్రామంలో మురికి నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు చేపట్టి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల మహిళ నాయకురాలు మేడేపల్లి హెూలీ మేరీ, సిఐటియు మండల కమిటీ కార్యదర్శి టిఎన్ఎం.సూరి పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఒత్తిడితోనే ఏజెంట్ లక్ష్మి మృతి

అగ్రిగోల్డ్ కస్టమర్స్, వెల్ఫేర్ అసోసియేషన్ కైకలూరు శాఖ అధ్యక్షులు జగన్మోహన్‌రావు

ప్రజాశక్తి - కలిదిండి

అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఒత్తిడి తాళలేకే ఏజెంట్ కురిచేటి లక్ష్మి(50) గుండెపోటుతో మృతి చెందిందని అగ్రిగోల్డ్ కస్టమర్స్, వెల్ఫేర్ అసోసియేషన్ కైకలూరు శాఖ అధ్యక్షులు చక్కా జగన్మోహన్‌రావు అన్నారు. మండలంలోని కోరుకొల్లు గ్రామానికి చెందిన మృతురాలు కురిచేటి లక్ష్మి గత తొమ్మిదేళ్లుగా అగ్రిగోల్డ్ కస్టమర్స్ నుంచి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారన్నారు. చిన్న కిరాణా షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. తన భర్త కూడా అగ్రిగోల్డ్ ఏజెంట్ కావడంతో, ఇరువురిపై ఒత్తిడి మరింతగా పెరిగిందన్నారు. ఈ క్రమంలోనే ఒత్తిడికి గురై గుండెపోటుతో లక్ష్మి మృతి చెందిందన్నారు. ఆమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారన్నారు. గత తొమ్మిదేళ్లుగా ప్రభుత్వాలు అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయకపోవడం వల్లే అనేక మంది అనారోగ్యంపాలై మరణిస్తున్నారన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వెంటనే అగ్రిగోల్డ్ ఏజెంట్లకు, కస్టమర్లకు న్యాయం చేయాలని కోరారు.

ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన ప్రజానాట్యమండలి

ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో వక్తలు

పజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో ప్రజా నాట్యమండలి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ ప్రజా నాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్.రాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఇతివృత్తంగా తీసుకుని వివిధ కళారూపాలను ప్రదర్శించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన ఏకైక ప్రజా కళా సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అన్నారు. ప్రముఖ విప్లవ కళాకారులు మాదాల రంగారావుతో పాటు సినీ రంగానికి చెందిన పలువురు కళాకారులు ప్రజా నాట్యమండలి ద్వారా వచ్చిన వారేనని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఆర్.కృష్ణబాబు మాట్లాడుతూ తాను ప్రజానాట్యమండలి ద్వారా పల్లె నుంచి ఢిల్లీ వరకు కళా ప్రదర్శన నిర్వహించడానికి ప్రజానాట్యమండలి దోహదపడిందని తెలిపారు. ప్రముఖ బుర్రకథ కళాకారులు వీరమల్ల సత్యనారాయణ మాట్లాడుతూ దశాబ్దాలుగా జానపద కళలు ప్రదర్శించే అవకాశం ప్రజానాట్యమండలి కల్పించిందన్నారు. ప్రముఖ రంగస్థల కళాకారుడు వెలగపాడు రత్నం మాట్లాడుతూ కళాకారులు ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పౌరాణిక కళాకారుడు తోట సత్యనారాయణ, నెల్లూరు రామానాయుడు పాల్గొన్నారు.



ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న కళాకారులు

సప్లిమెంటరీ పరీక్షలు రెండోరోజు ప్రశాంతం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఏలూరు జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకరరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 27 పరీక్షా కేంద్రాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు మొత్తం 4,051 మందికి 3,789 మంది హాజరు కాగా 262 మంది గైర్హాజరయ్యారు. 94 శాతం హాజరు నమోదైంది. ఇందులో సాధారణ విద్యార్థులు 3,598 మందికి 3,379 మంది హాజరు కాగా 219 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్య విభాగంలో 453 మందికి 410 మంది హాజరు కాగా 43 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి ఐదున్నర గంటల వరకు జరిగిన ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు మొత్తం 375 మందికి 315 మంది హాజరు కాగా 60 మంది గైర్హాజరయ్యారు. 84 శాతం హాజరు నమోదైంది. ఇందులో సాధారణ విద్యార్థులు 187 మందికి 160 మంది హాజరు కాగా 27 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యా విభాగంలో 188 మందికి 155 మంది హాజరు కాగా 33 మంది గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకరరావు తెలిపారు.

ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల్లో హెచ్‌పిసిఎల్ ముఖ్యమైంది

విజయవాడ చీఫ్ రీజనల్ మేనేజర్ ఆదిత్య ఆనంద్



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినవారిని జ్ఞాపికలు అందిస్తున్న వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల్లో హెచ్‌పిసిఎల్ అనేది చాలా ముఖ్యమైందని విజయవాడ చీఫ్ రీజనల్ మేనేజర్ ఆదిత్య ఆనంద్ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల హెచ్‌పిసిఎల్ డీలర్స్ మీట్-2024ను స్థానిక ఆర్ఆర్.పేటలోని ఆర్నా హోటల్‌లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవాడ చీఫ్ రీజనల్ మేనేజర్ ఆదిత్య ఆనంద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి నాట్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న బాలికలకు జ్ఞాపికలు అందించారు. అనంతరం 2023-2024 సంవత్సరానికి పదో తరగతిలో స్టేట్ మొదటి ర్యాంకు సాధించిన ఆకుల వెంకట నాగ సాయి మనస్వినిని ఆదిత్య ఆనంద్ శాలువా కప్పి సత్కరించి, హెచ్‌పిసిఎల్ జ్ఞాపికను, బహుమతిగా రూ.పది వేల చెక్కును అందించారు. అనంతరం మనస్వి తల్లిదండ్రులను సత్కరించారు. అనంతరం ఆదిత్య ఆనంద్ మాట్లాడుతూ హెచ్‌పిసిఎల్ మీట్‌కి వచ్చిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. 1974లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో హెచ్‌పిసిఎల్‌ను ప్రారంభించామని, 2024కు 50 ఏళ్లు పూర్తయినందుకు గోల్డెన్ జూబ్లీ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల్లో హెచ్‌పిసిఎల్ అనేది చాలా ముఖ్యమైందని తెలిపారు. కస్టమర్లకు ఎప్పుడూ క్వాలిటీ, క్వాంటిటీ పరంగా మంచి సర్వీస్‌ను అందిస్తున్నామని చెప్పారు. రోజురోజుకి హెచ్‌పిసిఎల్ కంపెనీ భారతదేశంలో విస్తరించడం చాలా గొప్ప విషయమన్నారు. చీఫ్ మేనేజర్ విల్సన్ మాట్లాడుతూ కస్టమర్లకు కన్వీనియన్స్ క్రియేట్ చేస్తూ పర్యావరణానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం రెన్యువబుల్ ఎనర్జీని తయారు చేయడానికి సిద్ధం చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 500 మెగా వాట్స్ సోలార్ పవర్ ప్లాంట్‌ను హెచ్‌పిసిఎల్ సంస్థ నిర్మించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. దేశంలో ఉన్న అన్ని పెట్రోల్ బంకుల్లోనూ సోలార్ లైటింగ్, సోలార్ సిస్టమ్స్‌ను పెట్టి పవర్ కంజంప్షన్‌ను తగ్గించడం, పర్యావరణాన్ని రక్షిస్తూ గ్రీన్ పవర్‌ను అందించడానికి హెచ్‌పిసిఎల్ కృషి చేస్తుందన్నారు. దేశంలో ఉన్న అన్ని హెచ్‌పిసిఎల్ పెట్రోల్ బంకులను గ్రీన్ పెట్రోల్ బంకులుగా తయారు చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఇన్నేళ్లుగా సహకరిస్తున్న కస్టమర్ దేవుళ్లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్ అక్షయ చౌహాన్, ఏలూరు జిల్లా సేల్స్ ఆర్గనైజర్ మహేష్, సందీప్, హెచ్‌పిసిఎల్ డీలర్లు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు.. ప్రజల వెతలు

పలు గ్రామాల్లో రెండు రోజులుగా విద్యుత్ కోతలు

ఇబ్బందుల్లో గ్రామస్తులు, విద్యార్థులు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో గత రెండు రోజులుగా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ప్రజానీకం పలు ఇబ్బందులకు గురవుతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో జరుగుతున్న పవర్ ప్రాజెక్టు కనెక్టివిటీ పనుల్లో భాగంగా ప్రాజెక్టు నుంచి తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం గుడ్డిగూడెం వరకు 400 కెవి లైన్ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖాధికారులు శుక్రవారం నుంచి పోలవరం మండలంలో దేవరగొంది, ఇటుకలకోట, రామయ్యపేట, పైడిపాక, పాతపట్టిసీమ, కొత్తపట్టిసీమ, గూటాల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. దీంతో పోలవరం మండలంలో అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల కోసం ప్రభుత్వోన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో జనరేటర్లు పెట్టుకోవాల్సిన పరిస్థితులు ఎదురయ్యారు. ఉక్కబోతతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ ఆధారిత నెట్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లు పనిచేయకపోవడం, సెల్ టవర్ల సిగ్నల్స్ కవరేజీ లేక ఇబ్బందులకు గురయ్యారు. బ్యాంకుల్లో నెట్‌వర్క్ పని చేయకపోవడం వల్ల వినియోగదారులు ఇబ్బందులకు గురయ్యారు.



మరమ్మతులకు గురైన తూము

చెరువు తూముకు మరమ్మతులు చేయరూ..!

400 ఎకరాలు నీట మునిగే ప్రమాదం

శెట్టివారిగూడెం రైతుల ఆవేదన

ప్రజాశక్తి - చింతలపూడి

మేడవరపు చెరువు ప్రధాన తూముకు వెంటనే మరమ్మతులు చేయించాలని శెట్టివారిగూడెం రైతులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని శెట్టివారిగూడెం గ్రామంలో ఉన్న మేడవరపు చెరువు ప్రధాన తూము ఇరిగిపోయి అధ్వానంగా తయారైంది. చెరువులో నీరు పెరిగేకొద్దీ చెరువు కట్ట, తూము విరిగి పడిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తూము పడిపోవడంతో వచ్చిన నీరు వచ్చినట్లుగా పొలాల పైకి వస్తే సుమారు 400 ఎకరాలు నీట మునిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకుని వెంటనే అధికారులు స్పందించకపోతే రానున్న వర్షాలకు 400 ఎకరాల్లో పంట వేయడానికి కూడా అవకాశం ఉండదని రైతులు ఆందోళన చెందుతుతున్నారు. అధికారులు స్పందించి తూముకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

హోమియో వైద్యశాల అభివృద్ధి పనులకు వితరణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

హోమియో వైద్యశాలల్లో అభివృద్ధి పనులకు దాతలు సహాయ, సహకారాలు అందించడం ఎంతో అభినందనీయమని ఆగిరిపల్లి ప్రభుత్వ హోమియో వైద్యాశాల వైద్యాధికారి డి.రజిత అన్నారు. ఆగిరిపల్లికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు, గ్రామ పంచాయతీ ఏడో వార్డు సభ్యులు యండూరు ప్రణీత్, అలేఖ్య దంపతులు తన తండ్రి యండూరి శ్రీరామకృష్ణ జగన్మోహన్‌రావు మూడో వర్ధంతిని పురష్కరించుకుని హోమియో వైద్యశాలల్లో ఏర్పాటు చేస్తున్న యోగా షెడ్డు నిర్మాణ పనులకు వితరణ అందించారు. హోమియో వైద్యాశాల వైద్యాధికారిణి డి.రజితకు రూ.75 వేల నగదును శనివారం అందించారు.

నేరాలు - ఘోరాలు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం

లోకుమూడిలో ప్రమాదం

ప్రజాశక్తి - మండవల్లి

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు పూర్తిగా దగ్ధమైన సంఘటన లోకుమూడి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... లోకుమూడికి చెందిన ఇంటి సంజీవరావు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. అతను శుక్రవారం సాయంత్రం వేరే ఊరు వెళ్లాడు. అయితే అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి ఇంట్లో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. మంటల్లో ఇల్లు పూర్తిస్థాయిలో ఖాళీ బూడిదైంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని డబల్ కాట్ మంచం, టీవీ, ఫ్రిడ్జ్, బీరువా, బంగారంతో పాటు దుస్తులు పూర్తిస్థాయిలో మంటల్లో కాలిపోయాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలిపోయారు. సమాచారం అందుకున్న సంజీవరావు ఇంటికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించాడు. విషయం తెలుసుకున్న విఆర్ఒ ఆంజనేయులు లోకుమూడి చేరుకుని పరిశీలించి తక్షణమే ఆదుకునే విధంగా విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపినట్లు బాధితులు తెలిపారు.



మంటల్లో పూర్తిగా దగ్ధమైన ఇల్లు

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం రూరల్

ఎదురుగా వస్తున్న కారు ఢీకొని వ్యక్తి గాయాలపాలైన ఘటన మండలంలోని తాడువాయి వద్ద జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జంగారెడ్డిగూడెం మండలంలోని చిన్నవారిగూడేనికి చెందిన కలపాల సుబ్బారావు తన మనవడి పుట్టినరోజు సందర్భంగా శనివారం కేక్ ఆర్డర్ ఇచ్చేందుకు బైక్‌పై జంగారెడ్డిగూడెం వెళ్లాడు. కేక్ ఆర్డర్ ఇచ్చి తిరిగి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో తాడువాయి గ్రామ సమీపంలోకి వచ్చేసరికి అశ్వారావుపేట నుంచి జంగారెడ్డిగూడెం వైపు వెళ్తున్న కారు సుబ్బారావును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన సుబ్బారావును స్థానికులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.



బైక్‌ను ఢీకొన్న కారు

నాటుసారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - టి.నరసాపురం

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బండివారిగూడెం గ్రామంలో నాటు సారా తయారు చేసి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు టి.నరసాపురం పోలీసులు శనివారం దాడి చేశారు. ఈ దాడిలో గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకుని అతని వద్ద నుంచి 30 లీటర్ల నాటుసారా, తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం చింతలపూడి కోర్టుకు తరలించినట్లు హెచ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని కామయ్యపాలెం గ్రామ శివారులో పేకాట స్థావరంపై జీలుగుమిల్లి పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నగదు, ద్విచక్రవాహనాలు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కామయ్యపాలెం గ్రామశివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు జీలుగుమిల్లి ఎస్ఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో శనివారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,560 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉన్నత విలువలు, ఉత్తమ విద్యే మా లక్ష్యం

భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రకుమార్



కరస్పాండెంట్ రవీంద్రకుమార్

ప్రజాశక్తి - భీమడోలు

ఉన్నత విలువలతో ఉజ్వల భవిష్యత్తును సాధించే పరిపూర్ణ విద్యార్థులను సమాజానికి అందించడమే లక్ష్యంగా భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల పని చేస్తుందని కరస్పాండెంట్ యలమర్తి రవీంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. విద్యార్థులకు ఉన్నతస్థాయి, ఉత్తమ ప్రమాణాలతో కూడిన విద్యను అందించటం, ప్రపంచ పటంలో భీమడోలుకు చెందిన విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు లభించే విధంగా సహకరించటం ధ్యేయంగా పని చేస్తున్నట్లు తెలిపారు. 22 ఏళ్ల క్రితం ప్రారంభమైన మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ఇప్పటివరకు ప్రతి ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత, అత్యధిక సంఖ్యలో 10/10 జిపిఎలు సాధిస్తున్నట్లు తెలిపారు. నాటి ఎంసెట్ నుంచి నేటి నీట్ పరీక్షల వరకు ఐఐటి, వైద్య విద్యలో ప్రతి ఏడాది మానస పునాదిగా చదివిన విద్యార్థులు సీట్లు సాధిస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన సామాన్య విద్యార్థులకు ఫౌండేషన్ కోర్సు ద్వారా శిక్షణ ఇచ్చి అసామాన్య ఫలితాలు సాధిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి సిబిఎస్ఇ విధానంలో తరగతులు కొనసాగించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని, ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ ఇచ్చామని చెప్పారు. విద్యార్థికి కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పడంతో పాటు విదేశీ విద్య అభ్యసించేందుకు ఆ ప్రాంతానికి చెందిన భాష, అవసరమైన ఇతర అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో విద్యార్థులకు సామాజిక స్పృహ, కుటుంబ విలువలు, గౌరవప్రద జీవనం పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ ప్రాధాన్యతను వివరిస్తున్నామన్నారు. పాఠ్యాంశాల ఆధారంగా బోధనకు అవసరమైన సంఖ్యలో ఫ్యాకల్టీలను ఏర్పాటు చేశామని తెలిపారు. మల్టీ కమ్యూనికేషన్స్ నేర్పే క్రమంలో స్పోకెన్ ఇంగ్లీష్, చేతిరాతను అభివృద్ధి చేసుకోవడం, ఇతర అంశాలు నేర్పుతున్నామన్నారు. విద్యార్థులను పలు అంశాల్లో నిష్ణాతులుగా చేసేందుకు ఇంగ్లీష్, తెలుగు, ఆంగ్లం, సైన్సు, లెక్కలు ఇతర అంశాలకు చెందిన ఆరు ఒలింపియాడ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. హిందీ భాష పట్ల విద్యార్థులకు ఆసక్తి కల్పించడం, ప్రత్యేకంగా నేర్పుతున్నామని చెప్పారు. హిందీ భాష పరీక్షలకు హాజరయ్యేందుకు వారికి అవసరమైన శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇదే క్రమంలో మానస పాఠశాల కేంద్రంగా ఒక హిందీ పరీక్షా కేంద్రం నడుస్తుందన్నారు. సాం స్కృతిక కార్యక్రమాలు, నృత్యం, కళలను ప్రోత్సహించడం, సాంప్రదాయ పద్ధతిలో వాటిని నేర్పేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఎల్‌కెజీ నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఆయాలతో కాక వారిని అమ్మలాగా చూసుకునే ఉపాధ్యాయులతో వారి అవసరాలు తీర్చే ఏర్పాట్లు ఉన్నాయన్నారు. విద్యార్థులకు ఫోన్, టివి ఎక్కువగా వాడడం, చూడడం ద్వారా వల్ల కలిగే దుష్ఫలితాలను వివరించి వారిని విజ్ఞానవంతులుగా చేసేందుకు పుస్తక పఠనాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. దీనికి అవసరమైన ప్రత్యేక గ్రంథాలయం ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి వి.లిఖిత అమెరికా దేశానికి చెందిన ఒక విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ విద్యార్థి పురస్కారం అందుకుందన్నారు. ఇదేవిధంగా పాఠశాలకు చెందిన కె.వంశీకృష్ణ జెఎంఎం మెయిన్ పరీక్షల్లో 99.08 మార్కులు సాధించి పాఠశాలకు దేశస్థాయిలో గుర్తింపు తెచ్చారన్నారు.



మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల



వంశీకృష్ణ

విజయ పథంలో క్రాంతి హైస్కూల్

కరస్పాండెంట్ చన్నంశెట్టి కృష్ణ



చన్నంశెట్టి కృష్ణ

ప్రజాశక్తి - కలిదిండి

గ్రామీణ ప్రాంతంలో ఒకే యాజమాన్యంతో 37 వసంతాలు పూర్తి చేసుకున్న కైకలూరు నియోజకవర్గంలో ఏకైక విద్యాసంస్థ మండలంలోని కోరుకొల్లు క్రాంతి హైస్కూల్ అని కరస్పాండెంట్ చన్నంశెట్టి కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన చేస్తున్నామని తెలిపారు. విశాలమైన తరగతి గదులు ఉన్నాయని, దూర ప్రాంత విద్యార్థులకు స్కూల్ బస్సు సౌకర్యం ఉందన్నారు. విద్యతో పాటు ఆటలు, యోగా, సాంస్కృతిక కళలు, స్పోకెన్ ఇంగ్లీష్, స్పెల్లింగ్ బి, డ్రాయింగ్, క్విజ్, వ్యాసరచన వంటి వాటిపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. మ్యాథ్స్‌పై పట్టు సాధించేలా అబాకస్ విధానం, లైబ్రరీ ఏర్పాటు, అన్ని తరగతులకు డిజిటల్ తరగతులు, కాలిగ్రాఫి ప్యాకల్టిచే హ్యాండ్ రైటింగ్‌పై శిక్షణ ఏర్పాట్లు కల్పించామన్నారు. జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్, సాంస్కృతిక, ఆటల పోటీలు నిర్వహించామన్నారు. సీజనల్ వ్యాధులను నివారించేలా ప్రతి ఏడాది హోమియో మాత్రలు అందిస్తున్నామన్నారు. వికలాంగులు, అనాథలకు ఉచిత విద్య కల్పించడంతో పాటు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఫీజులో రాయితీ ఇస్తున్నామన్నారు. నాటి నుంచి పదో తరగతి ఫలితాల్లో పలుమార్లు మండల, జిల్లాస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించామన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆర్థిక సాయం అందించి, సన్మానిస్తున్నామన్నారు. సమాజ సేవా కార్యక్రమంలో ముందున్నామన్నారు. కరోనా సమయంలో కోరుకొల్లు పిహెచ్‌సి పరిధిలోని గ్రామాల్లో కరోనా సోకిన సుమారు 200 మందికి పౌష్టికాహారంతో పాటు శానిటైజర్స్, మాస్కులు, ఆవిరి యంత్రాలను అందించామన్నారు. లయన్స్ క్లబ్ ద్వారా ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, చూపు లేని వారికి వైద్యుల సూచనల మేరకు ఉచిత కంటి ఆపరేషన్లు చేయించామన్నారు. కోరుకొల్లు గ్రామంలో అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి, బట్టలు పంపిణీ చేశామని చెప్పారు. నలుగురు పూర్వ ఉపాధ్యాయులకు కుటుంబ పోషణ, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1.70 లక్షలు ఆర్థిక సాయం అందించామన్నారు. కలెక్టర్, ఎస్‌పి, డిఇఒలచే పలు మార్లు ప్రశంసలు అందుకున్నామన్నారు. కార్పొరేట్ స్కూల్స్‌కు ధీటుగా బడ్జెట్ స్కూల్స్‌ని నిలబెట్టేందుకు తన వంతు ప్రయత్నం కొనసాగిస్తున్నానని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) జిల్లా కార్యదర్శిగా, జిల్లా అధ్యక్షునిగా, రాష్ట్ర కార్యదర్శిగా పని చేసి బడ్జెట్ స్కూల్స్ అభివృద్ధికి కృషి చేస్తున్నానని చెప్పారు.



పూర్వ ఉపాధ్యాయునికి సాయం చేస్తున్న కృష్ణ

ఓట్ల లెక్కింపునకు సిద్ధంకండి

పోలింగ్ అధికారులు, సిబ్బందికి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ అభినందన

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల నిర్వహణలో కీలక ఘట్టమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు కార్యోన్ముఖులు కావాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక కలెక్టర్ బంగ్లాలో ఎన్నికల విధుల్లో భాగస్వాములైన అధికారుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన అధికారులను, సిబ్బందిని ఆయన అభినందించారు. ఓటర్ల జాబితా తయారీ నుంచి ఎన్నికలు ముగిసే వరకూ ప్రతి దశలోనూ ఆయా అధికారులు, సిబ్బంది తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించారని కొనియాడారు. ఎన్నికల నిర్వహణలో పోలీస్ అధికారులు, సిబ్బందికి చక్కని మార్గనిర్దేశం చేసిన జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతిని ప్రత్యేకంగా అభినందించారు. ఎస్‌పి డి.మేరీప్రశాంతి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పోలీస్, జిల్లా పరిపాలనా యంత్రాంగం మంచి సమన్వయంతో పని చేసినందునే పోలింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో ముగిసిందన్నారు. తమకు సహకరించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు జిల్లా ఎస్‌పి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెసి బి.లావణ్యవేణి, అదనపు ఎస్‌పి స్వరూపరాణి, సెబ్ జాయింట్ డైరెక్టర్ ఎన్.సూర్యచంద్రరావు, డిఆర్ఒ డి.పుష్పమణి, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులు, డిఎస్‌పిలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' సప్లిమెంటరీ హిందీ పరీక్ష

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ హిందీ పరీక్షకు 1939 విద్యార్థులకు 239 మంది మాత్రమే హాజరయ్యారని, 1700 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. రెండో రోజు మొత్తం 19 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

చాట్రాయి : చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు జరుగుతున్నాయి. శనివారం నిర్వహించిన హిందీ పరీక్షకు 36 మంది విద్యార్థులకు పది మంది హాజరయ్యారని, 26 మంది గైర్హాజర్యారని ఎంఇఒ వియస్‌వి.బ్రహ్మచారి తెలిపారు.

పోలవరం : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన హిందీ పరీక్షకు విద్యార్థులు అధిక శాతంలో గైర్హాజరయ్యారు. 58 మంది విద్యార్థులకు ఎనిమిది మంది మాత్రమే హాజరయ్యారని, 50 మంది గైర్హాజరయ్యారని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు లక్ష్మీకాంతం తెలిపారు.

కిశోర బాలికలకు పలు అంశాలపై అవగాహన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని ఈదర ఎస్‌సి ఏరియాలోని అంగన్వాడీ సెంటర్-2లో కిశోర బాలికల అవగాహన కార్యక్రమం ఈదర సెక్టార్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.రాగమయి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 11 నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, కెరీర్ గైడెన్స్, ఎనీమియా, ట్రాఫికింగ్, న్యూట్రిషన్ ఫుడ్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు రాజకుమారి, విజయకుమారి, రాణి, పుష్పరాజ్యం పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని పోతవరప్పాడు ఎన్ఆర్ఐ కళాశాలల్లో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కార్యక్రమంలో భాగంగా సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హెచ్‌సిఎల్ కంపెనీ హెచ్ఆర్ డి.బాలచక్రధర్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కౌశల్ వికాస్ యోజనకు సంబంధించి సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ డాక్టర్ ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభాస్కర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జి.సాంబశివరావు, ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ జి.ఆదిలక్ష్మి, ముఖ్య సలహాదారులు డాక్టర్ ఎన్‌వి.సురేంద్ర, మురళీకృష్ణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం



శిక్షణ శిబిరంలో చిన్నారులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం (సమ్మర్ క్యాంపు)లో భాగంగా శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి 11:30 గంటల వరకు రిసోర్స్ పర్సన్లు నీతి కథలు, దేశభక్తి గీతాలు, సరదా గేమ్స్, పేపర్ క్రాఫ్ట్, మెమరీ గేమ్స్‌లో శిక్షణను కొనసాగించారు. మధ్యలో విద్యార్థులందరికీ స్నాక్స్ పంచి పెట్టారు. ఈ శిక్షణ కార్యక్రమాలను డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు పర్యవేక్షించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు డి.శ్రీవల్లి, జి.కళ్యాణి, టి.నళిని, కె.మహిధర్, హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ టీమ్ సెక్రటరీ దుర్గాప్రసాద్, జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంది విటి.సందీప్‌కుమార్, ఎండి ఎ.అస్లాం పాషా, ఎం.కనకదుర్గ, విద్యార్థులు, పేరెంట్స్, అధిక సంఖ్యలో చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు.

పిహెచ్‌సి అభివృద్ధికి రూ.20 వేలు అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

సేవా దృక్పథంతో ముసునూరు మండల కేంద్రమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఓ దాత రూ.20 వేల ఆర్థిక సాయం అందించారని నూజివీడు డిప్యూటీ డిఎంహెచ్ఒ జాస్తి జగన్మోహన్‌రావు, ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు షకీనా ఇవాంజిలా తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెలివరీ రూమ్‌లో సెంట్రీ ఐటిమ్మ చెడిపోవడంతో పాటు, విద్యుత్ సౌకర్యం కూడా లేకపోవడంతో పలు అవసరమైన ఇబ్బందులు ఉన్నాయని చెప్పారు. నాణ్యమైన డెలివరీ రూమ్ నిర్మాణానికై మండల కేంద్రమైన ముసునూరు గ్రామానికి చెందిన చలసాని శ్రీమన్నారాయణ రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారని తెలిపారు.



ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీమన్నారాయణ

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న దాతలు

ప్రజాశక్తి - చింతలపూడి

ఇటీవల మృతి చెందిన జర్నలిస్ట్ అశోక్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని చింతలపూడి ఎలక్ట్రానిక్ మీడియా, ప్రెసిడెంట్ హరిబాబు, ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా నాయకులు చెన్నారావు అన్నారు. ఇటీవల మరణించిన జర్నలిస్టు అశోక్ కుటుంబానికి అందరూ అందించిన ఆర్థిక సాయం రూ.33,100ను శనివారం ప్రజాశక్తి రిపోర్టర్ రవి ద్వారా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అశోక్ సీనియర్ జర్నలిస్ట్ అని, అందరితో కలిసి మెలిసి ఉండేవాడని, ప్రజా సమస్యలపై పత్రిక ద్వారా అధికారులకు తెలియజేసి ఆ సమస్యల పరిష్కారనికి కృషి చేసేవారని తెలిపారు. అశోక్ మృతి ఆ కుటుంబానికి తీరని లోటన్నారు. ఆ కుటుంబానికి ఎప్పుడు ఏ ఆపద వచ్చినా తాము అండగా ఉంటామని, అన్నివేళలా తమను సంప్రదించవచ్చిని తెలిపారు.

జనసేన పార్టీ చేయూత

జర్నలిస్ట్ అశోక్ మృతి ఆయన కుటుంబానికి తీరని లోటని, ఆ కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటామని నసేన పార్టీ మండలాధ్యక్షులు చిదరాల మధుబాబు అన్నారు. వారు శనివారం అశోక్ కుటుంబానికి రూ.11 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ తరపు నుంచి ఎప్పుడు ఏం అవసరమొచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాలంటీర్ రాజీనామా

ప్రజాశక్తి - ముసునూరు

ఎన్నికల కోడ్ మొదలైనప్పటి నుంచి గ్రామ, పట్టణ సచివాలయ వాలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతూనే ఉంది. మండల పరిధిలోని ఒక వాలంటీర్ శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఎంపిడిఒ చాగంటి పద్మావతిదేవికి రాజీనామా పత్రం అందించారు. ఇప్పటికి 300 మంది వాలంటీర్లకు 290 మంది రాజీనామా చేశారని ఎంపిడిఒ తెలిపారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

ప్రజాశక్తి - వేలేరుపాడు

వేలేరుపాడు వ్యవసాయ పంట విత్తనాల్లో నకిలీ విత్తనాలు రాకుండా అధికారులు పటిష్టంగా చర్యలు చేపట్టాలని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా డిమాండ్ చేసింది. మండలంలోని రాళ్లపూడి గ్రామంలో శనివారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో (ఎఐపికె ఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌కె.గౌస్ మాట్లాడారు. గిరిజన పేద రైతులకు అన్ని రకాల విత్తనాలను ప్రభుత్వమే 50 శాతం రాయితీలతో ఇవ్వాలని, మార్కెట్‌లో వచ్చే కల్తీ విత్తనాలను అరికట్టాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు ముంపులో లేనటువంటి రామవరం మేడేపల్లి గ్రామ పంచాయతీల గిరిజన పేద రైతులకు వ్యవసాయ రుణాలు ఇవ్వాలని, పాత వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని అశ్వారావుపేట మండలంలో ఉన్న పెదవాగు ప్రాజెక్టు కుడి ఎడమ కాలువలను పూడికలు తీసి సకాలంలో రైతులకు సాగునీరందించాలని, ఆదివాసీ గిరిజన పేద రైతులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డాల ముత్యాలరావు, వేలేరుపాడు మండల కార్యదర్శి సోయం చంద్రరావు, పార్టీ మండల కమిటీ సభ్యులు ఆసి లక్ష్మయ్య, మడకం నాగేశ్వరరావు, లంకపల్లి శివ మోసం రాజారావు, పిడిగాల సత్యనారాయణ, గ్రామ కమిటీ సభ్యులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ అండగా ఉంటా : చింతమనేని

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి తాను అండగా ఉంటానని టిడిపి దెందులూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గంలోని టిడిపి కూటమికి చెందిన ప్రతి ఒక్క కార్యకర్త ఎంతో స్వచ్ఛందంగా కృషి చేశారని, వారందరికీ ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతున్నానన్నారు. దెందులూరు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన వందలాది మంది నాయకులు, కార్యకర్తలు శనివారం ఉదయం దుగ్గిరాలలోని కార్యాలయంలో చింతమనేని ప్రభాకర్‌ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. తమ గ్రామాల్లో జరిగిన పోలింగ్ సరళిని చింతమనేనికి వివరించారు. ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం విశేష కృషి చేసిన ప్రతిఒక్కరీ సేవలను గుర్తుంచుకుని వారికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికీ పార్టీలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి అందించి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు రూరల్ మండలాధ్యక్షులు నంబూరి నాగరాజు, పెదవేగి మండలాధ్యక్షులు బొప్పన సుధ, పలువురు సీనియర్ నాయకులు, కొల్లేటి గ్రామాల పెద్దలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ముగిసిన సహాయమాత మహోత్సవాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి ఆర్‌సిఎం చర్చి ఆవరణలో గత మూడు రోజులుగా జరుగుతున్న సహాయమాత మహోత్సవాలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. చివరి రోజు భారీ ఊరేగింపుతో సహాయమాత స్వరూపాన్ని గ్రామ పురవీధుల్లో మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించారు. విజయవాడ మాత్రాసనం నుంచి వచ్చిన వికార్ జనరల్ ఫాదర్ మేశాపం గాబ్రియల్ క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు. ముదినేపల్లి విచారణ కర్తలు మాతంగి మరియ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పండుగలకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి వేలాదిగా భక్తుల తరలివచ్చారు. అనంతరం బాల బాలికలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

ఘనంగా ఊరేగింపు

ప్రజాశక్తి -పోలవరం

మండల కేంద్రమైన పోలవరం గ్రామ దేవత కడమ్మ వారిని శనివారం గ్రామంలో ఊరేగించారు. గ్రామ శివారున కడమ్మ స్లూయిజ్ సమీపంలో ఉన్న కడమ్మవారిని ఆలయ కమిటీ సభ్యులు మేళతాళాలతో పల్లకిలో ఊరేగించారు. అనంతరం గ్రామ నడిబొడ్డున ఉత్సవ విగ్రహాన్ని ఉంచి పూజలు నిర్వహించారు.